సాక్షి
బాపట్ల
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024




హుండీ ఆదాయం రూ.12,44,454

మంగళగిరి: స్థానిక గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.12.44, 454 సమకూరింది. సోమవారం హుండీ లెక్కించిన అధికారులు వివరాలు వెల్లడించారు.



భవానీ దీక్షల హుండీ ఆదాయం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ అనంతరం హుండీల ద్వారా వచ్చిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.2.70 కోట్ల మేర ఆదాయం సమకూరింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 571.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

గుంటూరు డీఆర్‌ఎంగా లిల్లీ పాండే

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు డీఆర్‌ఎంగా కేంద్ర సాంస్కృతిక విభాగంలో డెప్యూటేషన్‌పై ఉన్న లిల్లీ పాండేను నియమిస్తూ రైల్వే శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఈనెల 26న గుంటూరు డీఆర్‌ఎంగా రాయపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్ మధుకర్‌ను నియమించింది. అయితే ఆ ఉత్తర్వులను తాజాగా రద్దు చేసి లిల్లీ పాండేను నియమించింది. ప్రస్తుత డీఆర్‌ఎం రామకృష్ణను ఎక్కడకు బదిలీ చేస్తారన్న విషయం ఆసక్తిగా మారింది.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



తాడేపల్లిరూరల్ (మంగళగిరి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా బాల్య వివాహ రహిత దేశంగా భారత్‌ను నిలిపే క్రమంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆచార్య కెవి నిరుపమ, అధ్యాపకులు డాక్టర్ షకీలా నూర్ బాషా, ర్యూన్సీ, ఉషాకిరణ్, స్వప్న, చంద్రమోహన్, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మంగళగిరి: ఎర్రచందనం వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని వ్యాపారులు కోరారు. నగరంలో ఆటోనగర్‌లోని అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరిని కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎస్ రవి రాజు, సెక్రటరీ నాగయ్య, జాయింట్ సెక్రటరీ కొండేటి ఆంజనేయులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీతో పాటు గతేడాది కాలంలో విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులతో కూడిన జీవో పుస్తకాన్ని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం వారి కార్యాలయాల్లో వేర్వేరుగా ఆవిష్కరించారు. 2025 క్యాలెండర్, డైరీలను పలు రకాల జీవోలతో ఉపాధ్యాయులందరికీ ఉపయుక్తంగా ఉండే విధంగా రూపొందించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పి.నాగ శివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, కె.రమేష్, పి.పార్వతి, ఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, జి.దాస్, సీహెచ్ లక్ష్మణ్‌కుమార్, కిషోర్, మూర్తి, శివరామకృష్ణ, బాలరాజు, కిరణ్, రమాదేవి, జయశ్రీ, కృష్ణారావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్-ట్రాక్టర్ ఢీ బాలుడు మృతి

మేదరమెట్ల: ఆడుతూ పాడుతూ హాయిగా గడపాల్సిన చిన్నారికి అప్పుడే నూరేళ్లు నిండాయి. తాతతో సరదాగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పడంతో బాలుడు మృతి చెందాడు. ఈఘటన కొరిశపాడులో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కొరిశపాడు గ్రామానికి చెందిన దుద్దు గౌతమ్ (4) తన తాతతో కలసి టీవీఎస్‌పై బజారుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి దానినే ఢీకొని ఇద్దరూ కిందపడిపోయారు. దీంతో గౌతమ్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొరిశపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలుడి మృతితో విషాదం నెలకొంది.

రెచ్చిపోతున్న మాఫియా

ఇసుక అక్రమ రవాణాకు ముకుతాడు పడేనా?

- జేసీబీని తగులబెట్టిన ఇసుక అక్రమదారులు
- ఘటనలపై జిల్లా కలెక్టర్ సీరియస్
- ఇద్దరు వీఆర్వోలు, ఆర్ఐ సస్పెన్షన్
- చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు
- మరికొందరిపై వేటు పడే అవకాశం



బోయినవారిపాలెంలో అక్రమ క్వారీలో టిప్పర్‌కు ఇసుక నింపుతున్న పొక్లెయిన్

చీరాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక మాఫియా పెచ్చరిల్లిపోతోంది. పట్టపగలే లారీలు, ట్రాక్టర్లతో ఇసుకను తోడేసి అమ్ముకుంటున్నారు. ఏ స్థాయిలో అంటే ముప్పై, నలభై అడుగుల లోతు తవ్వి భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అంటే తీర ప్రాంత పరిస్థితి ఎలా తయారైందో అర్థం చేసుకోవచ్చు. పాయిపాలెంలో బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి ఇసుక అక్రమదారులు తవ్విన గుంతలో పడి మృత్యువాతపడ్డాడు. ఈ విషయం గ్రామంలో పెద్ద రాద్ధాంతం జరిగినా రాజకీయ పలుకుబడి ఉపయోగించి దానిని సరిపెట్టేశారు. ఆరు నెలల కిందట ఈపురుపాలేనికి చెందిన భవన నిర్మాణదారుడు ఇసుక కావాలని ఓ క్వారీ యజమానికి ఆర్డర్ చేశాడు. ఆ క్వారీ నుంచి ట్రాక్టర్‌లో ఇసుకతోపాటు సగం తెగిపడిన మొండెం రావడం అప్పట్లో సంచలనం కలిగించింది. ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ ఇసుక కోసం తీసిన గుంతలో పడి మృత్యువాత పడ్డారు. అనేక పశువులు కూడా ఈ గోతుల్లో పడి చనిపోయాయి. చీరాల రూరల్ మండలంలో ఇసుక తవ్వకాలకు ఎవరికీ అనుమతి లేదు. అయినా ఈ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.

వారే కింగ్‌లు..

రూరల్ మండలంలో రామకృష్ణ (పరోట), బాబీ, రామకృష్ణ, శివ, సుబ్బారావు, బాబులు అక్రమ రవాణా చేస్తుంటారు. ఇందులో ఆర్ఆర్ జోక్యం చేసుకుని అధికారం మాది మాకు వాటా ఇవ్వాలంటూ పలుమార్లు హెచ్చరించడంతో రామకృష్ణ అందుకు అంగీకరించలేదు. దీంతో రామకృష్ణకు చెందిన జేసీబీని నెల్లూరు జిల్లాకు చెందిన ఆర్ఆర్ అనుచరుడు సతీష్ తగులబెట్టాడు. రామకృష్ణ మాత్రం తాను బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ అనుచరుడిని నా వాహనాలు పట్టుకోకండి అని అధికారులను బెదిరిస్తుంటారు. అలానే బాపట్లకు చెందిన మామిడియ్య కూడా తోటవారిపాలెం బైపాస్ వద్ద, బోయినవారిపాలెంలో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తూ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. పాత చీరాల పంచాయతీ పరిధిలో అంకమ్మరెడ్డి క్వారీ ప్రారంభించి ఇసుక దందా నిర్వహిస్తున్నాడు. కూటమి నేతల అండతో ఇసుకాసురుడుగా కీర్తి గడించాడు. వేటపాలెం మండలంలో హరికృష్ణ, సతీష్, జనసేన నేత అనుచరులు ఇసుక అక్రమ వ్యాపారం భారీగా దోచుకుతింటూ కీలకంగా వ్యహరిస్తున్నారు.

అక్రమ రవాణాకు 'చెక్'పోస్టు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు ప్రత్యేకంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. చీరాలలో జరుగుతున్న ఇసుక ఆధిపత్య పోరుకు పోలీసులు అడ్డుకట్ట వేసేలా రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ బోయినవారిపాలెంలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వేటపాలెం జాతీయ రహదారిపై చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటలు పోలీసులు ట్రాక్టర్లు, లారీలు తనిఖీ చేస్తూ ఇసుక అక్రమ రవాణా చేయకుండా చేయడం కూటమి నేతలు, ఇసుక అక్రమార్కులు జీర్ణించుకోలేకపోతున్నారు.



బోయినవారిపాలెంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది

బలైన రెవెన్యూ ఉద్యోగులు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోవడం, సకాలంలో సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించకపోవడం, విధుల్లో అలసత్వం వహిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ వెంకట మురళి ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటుగా సస్పెండ్ చేశారు. పలు వివాదాలకు, అవినీతి, అక్రమాల్లో ఆరితేరిన చీరాల ఆర్ఐగా పనిచేస్తున్న కె.నాగకుమార్‌తో పాటు వీఆర్వోలు శివారెడ్డి, తులసీలను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆధిపత్య పోరులో ఇసుకను అక్రమంగా రవాణా చేసుకుంటున్న అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలకు రెవెన్యూ ఉద్యోగులు బలి పశువులుగా మారామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు పనిచేస్తున్న వారిని, అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న రెవెన్యూ ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో రెవెన్యూ ఉద్యోగుల్లో ఇసుక టెన్షన్ మొదలైంది.

చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం..

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆదేశాలతో వేటపాలెం–216 హైవేలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై పీడీ యాక్టులు నమోదు చేస్తాం.

– శేషగిరిరావు, చీరాల రూరల్ సీఐ

సిబ్బందిలో భయాందోళనలు..

చీరాల నియోజకవర్గంలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు ఇసుక పేరు వింటేనే భయాందోళన చెందే పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు ప్రభుత్వం సూచించే విధులు, మరో వైపు ప్రజలకు రెవెన్యూ సేవలందించే ఉద్యోగులు అధికార పార్టీ ఇసుక దోపిడీకి అడ్డుపడుతుండటంతో నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. రెవెన్యూ ఉద్యోగులు కత్తిమీద సాములా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇసుక అక్రమ రవాణా కారణంగా విధుల్లో అలసత్వం పేరుతో ముగ్గురు రెవెన్యూ ఉద్యోగులను కలెక్టర్ సస్పెండ్ చేయడంతో రెవెన్యూ ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు.



ఇసుక తవ్వకోగా చెరువులా మారిన ప్రాంతం

ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్లటౌన్: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా ఉపేక్షించేది లేదన్నారు. న్యూ ఇయర్ ముసుగులో అల్లర్లు సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైలెన్సర్ లేకుండా తీవ్రమైన రణగొణధ్వనులు సృష్టిస్తూ ద్విచక్ర వాహనాలు నడిపినా, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేసినా, మైనర్లు వాహనాలు నడిపిన, అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. మహిళలు, యువతులను వేధించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు మాత్రమే మద్యం విక్రయా లు జరపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్య లు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో అర్ధరాత్రి ఒంటి గంట తరువాత రహదారులపైన, వీధులలో తిరగరాదన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. ముఖ్యమైన కూడళ్లలో పికెట్‌లు ఏర్పాటుచేసి వాహన తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్‌కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 40 మంది బాధితులు నేరుగా ఎస్పీని కలసి సమస్యలు విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అర్జీలపై ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించాలని అన్నారు. అర్జీలను పరిష్కరించడానికి రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ప్రాథమిక సహకార సంఘాల డేటాను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలపై పత్రికల్లో వచ్చిన వార్తలకు తీసుకున్న చర్యలపై నివేదికలను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో రోడ్లు, తాగునీరు సౌకర్యాలు లేవని ప్రజలు జిల్లా కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లా పంచాయతీ అధికారి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్లు పరిశీలించి సంబంధిత పనులు చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదన తయారు చేయాలని సూచించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై అవగాహన తెలియజేసే వాల్ పోస్టర్లను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై గుంతలు పూడ్చండి

రహదారులపై ప్రజలు సురక్షితంగా ప్రయాణించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమంపై రోడ్లు, భవనాలశాఖ అధికారులు, గుత్తేదారులతో సోమవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చే ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే పనులు ప్రారంభం కానీ ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జనవరి 15వ తేదీలోగా పనులు పూర్తి కాకపోతే నోటీసులు ఇవ్వాలన్నారు. బాపట్ల జిల్లాలోని రాష్ట్ర రహదారులపై 159 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 73 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తయ్యాయన్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులపై మొత్తం 584 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 101 పనులుగా విభజించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రహదారులు భవనాల శాఖ ఎస్ఈ వి శ్రీనివాసరావు, డీఈలు, గుత్తేదారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవు

ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపులు బాపట్ల జిల్లాలో జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆర్డీఓలను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా, తరలింపులపై ఆర్డీవోలతో సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. విధుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చెప్పారు. చీరాల తహసీల్దార్ కె గోపికృష్ణకు షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు. చీరాల మండలం ఆర్ఐ కె నాగకుమార్, అదే మండలంలో తోటవారిపాలెం వీఆర్వో ఎస్ శివరామిరెడ్డి, బోయినవారిపాలెం వీఆర్వో పి తులసీరావులను సస్పెండ్ చేశామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సంతకం ఫోర్జరీపై ఫిర్యాదు

మార్టూరు: ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధులను డ్రా చేసేందుకు యత్నించడంతో సర్పంచ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఇసుక దర్శి అగ్రహారానికి సత్తెనపల్లి నారాయణమ్మ గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. అదే గ్రామానికి జాగర్లమూడి సురేష్‌బాబు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి సర్పంచ్‌కి తెలియకుండా ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.2.48 లక్షల నిధులు డ్రా చేసే ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన సర్పంచ్ నారాయణమ్మ సోమవారం జిల్లా కలెక్టర్ వెంకట మురళికి గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంటనే డీపీవో, ఎంపీడీవో శ్రీనివాసరావులను సర్పంచ్ ఫిర్యాదుపై విచారించాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్ నారాయణమ్మ ఈఓఆర్డీ సుబ్బారావుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

క్షమించి వదిలేయొచ్చు కదా..

ఎంపీడీవో శ్రీనివాసరావు ఈ ఒక్కసారికి పంచాయతీ కార్యదర్శి సురేష్బాబును క్షమించి వదిలి వేయవచ్చు కదా.. అంటూ రాజీ చేసే ప్రయత్నం చేయడం గమనార్హం. సర్పంచ్ నారాయణమ్మ అందుకు అంగీకరించక లేదు. చేసేదిలేక అధికారులు విచారిస్తున్నారు.

న్యాయవాదులపై పోలీసుల తీరు అమానుషం

- రోడ్డుపై బైఠాయించిన న్యాయవాదులు
- పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

చీరాల రూరల్: కూటమి ప్రభుత్వంలో పోలీసులు తీరు దారుణంగా తయారైందని..పోలీసులు చేస్తున్న అరాచకాలు, దురుసు ప్రవర్తనతో న్యాయవాదులు భయాందోళనలకు గురవుతున్నారని.. అటువంటి పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని చీరాల న్యాయవాదులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అనంతపురం మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో న్యాయవాది మృతి చెందిన ఘటన, మరో సీనియర్ న్యాయవాదిని చొక్కా పట్టుకుని రోడ్డుపై సీఐ లాక్కెళ్లిన ఘటనలను నిరసిస్తూ సోమవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. న్యాయవాదులు మాట్లాడుతూ రెండు రోజుల కిందట అనంతపురం మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో సీనియర్ న్యాయవాదిని సివిల్ కేసులో స్టేషన్‌కు పిలిపించి భయాందోళనలకు గురిచేసి ఆయన మృతికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఘటనకు కారణమైన సీఐ, ఇతర పోలీసులను సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలానే రాయచోటి జిల్లా గాలివీడులో సీనియర్ న్యాయవాది సుదర్శనరెడ్డి చొక్కా కాలర్ పట్టుకుని రోడ్డుపై సీఐ లాక్కెళ్లడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎవరికైనా చట్టం ఒకటేనని, పోలీసులు చట్టానికి లోబడి విధులు నిర్వర్తించాలని చెప్పారు. న్యాయవాదులు తప్పులు చేసుంటే వారిపై కేసులు నమోదు చేయాలే కాని నడిరోడ్డుపై రౌడీలను, కేడీలను, దొంగలను లాక్కెళ్లినట్లు లాక్కెళ్లడం చూస్తుంటే న్యాయవాదులకు రక్షణ ఎక్కడుందని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయవాదుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేసి వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, కొటిక ఉదయభాస్కరరావు, సీనియర్ న్యాయవాదులు బండారుపల్లి హేమంత్ కుమార్, టీజే సాయిబాబు, బోయిన శ్రీనివాసరావు, బొనిగల జైసన్‌బాబు, ఎస్.కామేశ్వరరావు, షేక్ సిరాజ్, ఆసాది సతీష్‌రెడ్డి, బూదరాజు శశికిరణ్, మంకెన అశోక్‌కుమార్, ఎం.రామకృష్ణ, నాగరాజు, జి.సురేష్, సీహెచ్.రామారావు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆక్రమిత స్థల పరిశీలన

- ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- తహసీల్దార్ నాంచారయ్య

సాక్షి ఎఫెక్ట్..

నగరం: టీడీపీ నాయకులు పాల్పడిన భూ కబ్జాలపై సోమవారం సాక్షి దినపత్రికలో 'అనుభవించు రాజ' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. నగరం మండలం బోరమాదిగపల్లిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరుపేదలకు అందించిన 1.88 ఎకరాలను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఆక్రమించుకుని మినుము సాగు చేపట్టారు. ఈ విషయంపై పత్రికలో కథనం రావటంతో తహసీల్దార్ నాంచారయ్య స్పందించి బోరమాదిగపల్లిలో మినుము పంట సాగుచేస్తున్న స్థలాన్ని సోమవారం పరిశీలించారు. పొలాన్ని స్వాధీనం చేసుకుని పంటను ధ్వంసం చేసేందుకు పురుగు మందు పిచికారి చేయించారు. ఈ విషయంపై పూర్తి దర్యాప్తు చేసి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాంచారయ్య

ఎస్సీ వర్గీకరణ వన్‌మెన్ కమిషన్‌కు భారీగా వినతులు

అభిప్రాయాలు తెలియజేసిన 1200 మంది

గుంటూరు వెస్ట్/నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వన్‌మెన్ కమిషన్‌కు భారీగా వినతులు వచ్చాయి. వివిధ ఎస్సీ ఉపకులాలకు చెందిన సుమారు 1200 మంది తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా అందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వన్‌మెన్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ్, ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అభిప్రాయాల సేకరణ జరిగింది. అధికంగా మాల సంఘాల నుంచి ఎక్కువ వినతులు వచ్చాయి. ఎస్సీ ఉపకులాల నుంచి కూడా దళిత నాయకులు వినతులు అందించారు. వినతుల స్వీకరణకు కలెక్టరేట్‌లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. కొందరు నాయకులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్ద బహిరంగంగానే తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



వనమెన్ కమిషన్ ముందు అభిప్రాయాలు తెలియజేస్తున్న దళిత నేతలు

రెడ్డిపేరంటాలమ్మ ఆలయానికి రూ.5,01,116 విరాళం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రెడ్డిపేరంటాలమ్మ ఆలయానికి గుంటూరుకు చెందిన జెట్టి ఉమాశంకరరావు, పావని దంపతులు రూ.5,01,116 నగదు విరాళంగా సోమవారం అందజేశారు. పురాతన చరిత్ర కలిగిన ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు గతేడాది రూ.2కోట్ల వ్యయంతో చేపట్టారు. పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. 2025 మార్చి 17న ఆలయంలో ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వజ్జా వీరాంజనేయులు తెలిపారు. ఆలయ నిర్మాణ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన ఉమాశంకరరావు దంపతులను సభ్యులు అభినందించారు. కమిటీ సభ్యులు జంపని లక్ష్మీనారాయణ, వజ్జా రామారావు, సీహెచ్ వెంకట సుబ్బారావు ఉన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ నరేంద్రరెడ్డి సేవలకు ప్రత్యేక గుర్తింపు



గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అభివృద్ధికి గుర్తింపు తీసుకొచ్చేందుకు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అందించిన సేవలు అభినందనీయమని ఐఎంఏ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, డాక్టర్ అనిల్ కుమార్ జె నాయక్ పేర్కొన్నారు. ఐఎంఏ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అవార్డు అందుకున్నారు. 2023–2024 సంవత్సరానికిగాను గుంటూరు బ్రాంచిని అన్ని విభాగాలలో ఉత్తమ పనితీరు కనపరిచేలా తీర్చిదిద్దినందుకు గాను డాక్టర్ బూసిరెడ్డికి ఈ అవార్డు దక్కింది. ఇటీవల హైదరాబాదులో రెండు రోజులు పాటు జరిగిన ఐఎంఏ జాతీయ సమావేశాల్లో భాగంగా శనివారం రాత్రి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వేదశ్రీకి ప్రథమ స్థానం



చీరాల అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న టి.వేదశ్రీ విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత సోమవారం తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో జరిగిన జిల్లాస్థాయి వ్యాస రచన పోటీలలో సీనియర్ ఎంపీసీ విద్యార్థిని ఐ.ఈశ్వరి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించిందన్నారు. వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయిలో జూనియర్ ఇంటర్ సీఈసీ విద్యార్థిని బి.రాణి తృతీయ బహుమతిని సాధించిందన్నారు. విజేతలను కళాశాల పిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. చదువుతోపాటు క్రీడారంగంలోనూ, సారస్వత రంగంలోనూ విద్యార్థినులు రాణించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మధుసూదనరావు, రాధాదేవి, పీడీ బాపయ్య, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కష్టజీవులకు అండగా సీపీఐ

- అధికారం ఉన్నా లేకున్నా పేదల పక్షాన పోరాటం
- చీరాలలో సీపీఐ శతవార్షికోత్సవంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వేదికపై మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్

చీరాల అర్బన్: అధికారం ఉన్నా.. లేకున్నా భూమి మీద కార్మిక, కర్షక కూలీలు, కష్టజీవులు ఉన్నంత కాలం సీపీఐ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. చీరాలలో సోమవారం సీపీఐ శత వార్షికోత్సవ సభ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఎర్రకవాతును సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలో ర్యాలీని గడియారస్తంభం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేదిక వరకు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ 99 ఏళ్లుగా పేద ప్రజలకు అండగా ఎర్రజెండా చేతపట్టుకొని పోరాటం సాగించిందన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీగా ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ జెండా పట్టుకున్న ఎంతో మంది అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టినా విశ్రమించకుండా నిరంతరం పేదల సంక్షేమం, హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారన్నా రు. తెలంగాణాలో భూమి కోసం, భుక్తి కోసం జరిగిన పోరాటంలో నాలుగు వేల మంది పోరాటం చేశారని గుర్తు చేశారు. దేశంలో మతాలను రెచ్చగొట్టి ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి అధికారం కోసం బీజేపీ చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజలు గుర్తించాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్‌షా అవమానిస్తే ప్రధాని మోదీ నోరు మెదపలేదన్నారు. అమిత్‌షా దేశ ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం ఖండించాలి..

అంబేద్కర్‌ను అవమానించిన బీజేపీ నేతను రాష్ట్రంలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పిన బీజేపీకి ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదన్నారు. విదేశీ పర్యటనకు వెళ్లే ప్రధానికి దేశంలో మణిపూర్‌లో జరిగిన ఘోరమైన చర్యలను ఖండించడానికి, పరామర్శించడానికి సమయం లేదా అని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం పతనం చేస్తుందని, కార్పొరేట్ శక్తులకు దేశసంపదను అప్పగిస్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, వీలైతే తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలో రెండు సార్లు రూ.15420 వేల కోట్లు పెంచారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న పెంచలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరేటి రామారావు ఆధ్వర్యంలో పాడిన ఉద్యమ గీతాలు అందరిని అలరించాయి. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యేల్, హైమా హాస్పిటల్ అధినేత డాక్టర్ జి.సుబ్బారావు, బీసీ ఫెడరేషన్ నాయ కులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెబీ శ్రీధర్, చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాష్, సీపీఐ కార్యవర్గ సభ్యులు మేడా వెంకట్రావు, చీరాల మండల కార్యదర్శి కొల్లా వీరరామాంజనేయులు, వేటపాలెం మండల కార్యదర్శి డి.వెంకటేశ్వరరెడ్డి, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి కెఎల్‌డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి



వర్చువల్‌గా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో వర్చువల్‌గా మాట్లాడుతూ గ్రౌండ్ లెవల్ పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు లింకేజి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను అధికారులు అప్పటికప్పుడే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని తెలిపారు. పోషణ్ వాటికలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని పేర్కొన్నారు. జిల్లాలో గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ ఆన్‌లైన్ అటెండెన్స్ వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం ఉదయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీఓ శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యార్డుకు 55,760 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 55,760 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 50,214 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ.16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 46,445 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులుగా కోకి

బాపట్ల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షులుగా కోకి రాఘవరెడ్డి, చదలవాడ శ్రీనివాసరావు, కోగంటి లవకుమార్‌లను నియమించారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. వీరితోపాటు జనరల్ సెక్రటరీలుగా షేక్ బాజీ, లూకా బాపన్నయ్య, బిట్రగుంట సత్యనారాయణలను నియమించారు. నూతనంగా ఎంపికైన వారికి పలువురు అభినందనలు తెలిపారు.

జార్ఖండ్ జట్టు ఆధిక్యం

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న విజయ్‌మర్చంట్ ట్రోఫీలో జార్ఖండ్ జట్టు ఆధిక్యం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జమ్ము, కశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 55.01 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌటు అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు 85.1 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 365 పరుగులు చేసింది. వాగ్స్ 108 పరుగులు చేయగా జార్ఖండ్ బౌలర్ అర్జున్ ఆరు వికెట్లు తీసి రాణించాడు.

విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేయండి

నరసరావుపేట: విభిన్న ప్రతిభావంతులు డీజిల్, పెట్రోల్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.సువార్త కోరారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏదైనా సొంతంగా వ్యాపారం, గుర్తింపు కల్గిన ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనం కల్గిన దివ్యాంగులు సబ్సిడీ కోసం దరఖాస్తు చేయాలని కోరారు. వారికి అయ్యే ఖర్చులో 50 శాతం రాయితీ రీయింబర్స్ చేయబడుతుందన్నారు. రెండు హార్స్ పవర్ ఇంజన్ సామర్థ్యం కల్గిన వాహనానికి నెలకు 15 లీటర్లు, దీనికంటే ఎక్కువ సామర్థ్యంగల ఇంజన్ గల బండికి నెలకు గరిష్ఠంగా 25 లీటర్లు వరకు రాయితీ పరిమితి ఉంటుందన్నారు. ఇంధన కొనుగోలు బిల్లులు, దరఖాస్తు ఫారం, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, బ్యాంకు పుస్తకం, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, పనిచేసే సంస్థ ధృవీకరణ పత్రాలను గుంటూరు బృందావన్ గార్డెన్ నాల్గవ లైనులోని కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సావిత్రీబాయి పూలే ప్రతిభా అవార్డుకు ఎంపికైన అమరేశ్వరి



వంటల అమరేశ్వరి

గుంటూరు ఎడ్యుకేషన్: దక్షిణాది ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు–2025కు గుంటూరు నగరానికి చెందిన భౌతికశాస్త్ర అధ్యాపకురాలు వంటల అమరేశ్వరి ఎంపికయ్యారు. ఆమె స్వస్థలం దాచేపల్లి కాగా, గుంటూరులోని వివిధ కళాశాలల్లో భౌతికశాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తూనే నీట్, ఐఐటీ, బిట్‌శాట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఏఎన్‌యూ భౌతిక శాస్త్ర విభాగంలో నానో సైన్స్‌పై పరిశోధనలు చేస్తున్నారు. తన పరిశోధన అంశాన్ని జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ప్రదర్శించి, విద్యావేత్తల ప్రశంసలు అందుకున్నారు. గుంటూరులో దశాబ్ద కాలంగా ఫిజిక్స్ క్రియేటివ్ అకాడమీ పేరుతో శిక్షణ సంస్థను నిర్వహిస్తూ, పేద విద్యార్థులకు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఆమె అందించిన సేవలకు గుర్తింపుగా సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులు జనవరి 19న గుంటూరు నగరంలో ప్రదానం చేయనున్నారు.

కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

తొలిరోజు అర్హత సాధించిన 166 మంది అభ్యర్థులు



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

నగరంపాలెం: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి గ్రౌండ్స్‌లోకి అనుమతించడంతో, ఎటువంటి తోపులాట లేకుండా ఒకరి తర్వాత ఒకర్ని లోనికి పంపించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పలువురు పోలీసు అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను, దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించారు. తొలిరోజు దేహదారుఢ్య పరీక్షలకు 290 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 36 మందికి సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుదిగారు. 290 మందిలో 36 మందిని అనర్హులుగా ప్రకటించగా, మిగతా 254 మందికి శరీర కొలత పరీక్షలు(పీఎంటీ) నిర్వహించారు. వీరిలో 39 మందికి ఛాతి, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. 254 మందిలో 39 మంది అనర్హులు కాగా, 215 మందికి 1,600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా, పోటాపోటీగా పరుగెత్తారు. వీరిలో 32 మంది అనర్హులు కావడంతో మిగతా 183 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 183 మందిలో ఒకరూ వైదొలగా, 182 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీ నిర్వహించారు. వీరిలో 74 మంది అర్హత సాధించగా, 108 మంది అనర్హత పొందారు. 183 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా, వారిలో 166 మంది అర్హత సాధించగా, 17 మంది అనర్హత పొందారు. 254 మంది అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 166 మంది అర్హత సాధించగా, 88 మంది అనర్హత పొందారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

- పోలీస్ సిబ్బంది బ్రీఫింగ్‌లో పాల్గొన్న ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి
- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- బందోబస్తుకు 1120 మంది సిబ్బంది

నరసరావుపేటరూరల్: యల్లమందలో సీఎం చంద్రబాబు పర్యటనకు 1120 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి వెల్లడించారు. ప్రజావేదిక పేదల సేవలో సభలో పాల్గొనేందుకు మంగళవారం సీఎం చంద్రబాబు యల్లమందలో పర్యటించనున్నారు. అక్కడ సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు, సిబ్బందికి గ్రామంలోని కల్యాణ మండపంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి ఐజీ దిశానిర్దేశం చేశారు. బందోబస్తు విధుల్లో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 99 మంది ఎస్‌ఐలు, 177 మంది ఏఎస్‌ఐలు, 320 మంది కానిస్టేబుల్స్, 44 మంది మహిళా కానిస్టేబుల్స్, 23 మంది మహిళా హోంగార్డ్‌లు, 281 మంది హోంగార్డులు, 136 మంది ఏఆర్, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వహించాలని చెప్పారు. అనంతరం హెలీ ప్యాడ్ నుంచి సభా వేదిక వరకు కాన్వాయ్ ట్రైల్ రన్ నిర్వహించారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లును జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు పరిశీలించారు.

రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్‌లో కొప్పరపాడు విద్యార్థి ప్రతిభ



కౌశల్ పోటీలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థి

బల్లికురవ: రాష్ట్రస్థాయిలో విజయవాడలో సోమవారం జరిగిన కౌశల్ 2024 క్విజ్ పోటీల్లో మండలంలోని కొప్పరపాడు ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి బత్తుల అభిరాం టీమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు పాఠశాల హెచ్ఎం పీ.శ్రీనివాసరావు తెలిపారు. నవంబర్ 26న పాఠశాల స్థాయిలో జరిగిన పోటీల నుంచి జిల్లా స్థాయికి 30 మందిని ఎంపిక చేశారు. డిసెంబర్ 6న జిల్లా స్థాయిలో పదోతరగతి విభాగంలో అభిరాం ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల నుంచి 52 టీమ్‌లు పాల్గొన్నాయి. వీరిలో అభిరామ్‌కు రూ.15 వేలు నగదు, మెమొంటోతో సత్కరించినట్లు హెచ్ఎం వివరించారు. విద్యార్థి అభిరాం పాఠశాల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంపై హెచ్ఎం ఉపాధ్యాయులు, ఎంఈవో 1,2లు ఎం.వస్రం నాయక్, కె.రమేష్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ దమ్ము అంజయ్య, పీఎంసీ, గ్రామ పెద్దలు అభినందించారు.

తాబేళ్లను పూడ్చివేసిన రక్షణ దళ సభ్యులు



గుంతలో పూడ్చేందుకు ఉంచిన తాబేలు కళేబరం

చినగంజాం: మరబోట్లు తాకిడి కారణంగా కొద్ది రోజులుగా చనిపోయి ఒడ్డుకు చేరుతున్న సముద్ర తాబేళ్ల కళేబరాలను రక్షణ దళ సభ్యులు సోమవారం పూడ్చి పెట్టారు. సముద్ర తాబేళ్ల రక్షణ కోసం ట్రీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రక్షణ దళ సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది సంయుక్తంగా తీరం వెంబడి చనిపోయిన తాబేళ్ల కళేబరాలను గుర్తించి పూడ్చి పెట్టారు. ముందుగా వారు ప్రతి రోజూ ఈ సీజన్‌లో చనిపోయిన తాబేళ్లను వారు తీరం వెంబడి పర్యటించి గుర్తిస్తారు. అనంతరం వాటని అన్నింటిని పర్యావరణం కలుషితం కాకుండా తీరానికి కొద్ది దూరంలో మట్టిలో పూడ్చి వేస్తారు. ట్రీ ఫౌండేషన్ సంస్థ తరఫున మొత్తం 12 మంది దళ సభ్యులు ఈ విధమైన విధులు నిర్వహిస్తుంటారు. దళ సభ్యులు సీ టర్టిల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేరుతో అప్రమత్తంగా ఉండి అటవీ శాఖ అధికారులు సమాచారం అందిస్తూ వారి ఆదేశాల మేరకు పనిచేస్తుంటారని ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ శవనం చంద్రారెడ్డి తెలిపారు.

‘అపుస్మా’ రాష్ట్ర అధ్యక్షుడిగా తులసీ విష్ణుప్రసాద్ ఎన్నిక



ప్రసంగిస్తున్న అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసీ విష్ణుప్రసాద్

కొల్లూరు: అపుస్మా నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా కొలసాని తులసీ విష్ణుప్రసాద్ ఎన్నికవడం పట్ల రాష్ట్ర ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశాయి. గుంటూరు జిల్లా వడ్లమూడి సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన అపుస్మా మాజీ అధ్యక్షుడు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అధ్యక్షతన (ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యాల అసోసియేషన్) జరిగిన వార్షిక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని చిలుమూరు శ్రీరామ రూరల్ విద్యాసంస్థల డైరెక్టర్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీవీ రమణారెడ్డి, అసోసియేట్ ఉపాధ్యక్షుడిగా జేఎస్పీ బాలాజీ, సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఎంవీ సుబ్బారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ఎం.కృష్ణలతోపాటు, మరో 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సమావేశం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌లు డాక్టర్ జి.పార్థసారథి వర్మ, డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్మిషన్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడు మృతి

అద్దంకి రూరల్: బైకు మీద వెళ్తున్న యువకుడి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టటంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన అద్దంకి మండలంలోని నామ్ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన నాగరాజు (32) చేపల చెరువులో పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై బైకుమీద గ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో శింగరకొండ నుంచి నామ్ హైవే కలిపే మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో నాగరాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత



ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన గురితప్పిన బాణం నటులకు బహుమతి అందజేస్తున్న లలిత కళానికేతన్ కమిటీ సభ్యులు

- తక్కెళ్లపాడులో ముగిసిన జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా గురితప్పిన బాణం ఎంపిక

పెదకాకాని: కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్టేట్‌బ్యాంక్ ఏజీఎం ఎంఎస్ఎన్ శర్మ అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో లలిత కళానికేతన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న 14వ జాతీయ స్థాయి ఆహ్వాన పరిషత్ నాటికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన నూతలపాటి కాళిదాసు, పెద్ది రమేష్‌బాబు, పిన్నమనేని తిరుపతయ్య విజేతల వివరాలు వెల్లడించారు. పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా రసఝురి పొన్నూరు వారి గురితప్పిన బాణం(ప్రథమ), అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇది అతని సంతకం(ద్వితీయ), అమృతలహరి ఆర్ట్స్ థియేటర్ వారి నాన్నా నేనొచ్చేస్తా(తృతీయ) స్థానాల్లో నిలిచాయి. అలానే ఉత్తమ నటుడు కృష్ణమూర్తి పాత్రదారి ఎన్.రవీంద్రరెడ్డి(ఇది అతని సంతకం), ఉత్తమ దర్శకత్వం అమృతలహరి(నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ రచన పిన్నమనేని మృత్యుంజయరావు(గురితప్పిన బాణం), ఉత్తమ నటి సావిత్రి పాత్రదారి ఎస్ అమృతవర్షిణి(నాన్నా నేనొచ్చేస్తా) ఉత్తమ బాల నటి శ్వేత పాత్రధారిణి ఎన్ యస్మిత(నా శత్రువు), ఉత్తమ సంగీతం కె సాయితేజ, ఉత్తమ ఆహార్యం జి.శ్రీధర్, ఉత్తమ లైటింగ్ ఫణి(గురితప్పిన బాణం)లను ఎంపిక చేశారు. అలానే ఉత్తమ సహాయ నటులు, జూరి ప్రదర్శలు, ఉత్తమ రంగాలంకరణ, జూరి నటులను ఎంపిక చేసి అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

ఏఎన్‌యూకు ఆరు పతకాలు



పతకాలు సాధించిన విజేతలతో యూనివర్సిటీ అధికారులు

సౌత్ జోన్ యువజన ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

ఏఎన్‌యూ: ఆల్ ఇండియా యూనివర్సిటీ (ఏఐయూ) నిర్వహించే అంతర విశ్వవిద్యాలయాల 38వ సౌత్ జోన్ యువజన ఉత్సవాల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆరు పతకాలు సాధించిందని యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్ తెలిపారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన యువజనోత్సవాలలో 24 విశ్వవిద్యాలయాలు పాల్గొన్నాయి. వీటిల్లో ఆరు పతకాలను వర్సిటీ సాధించినట్లు వివరించారు. వాటిల్లో స్పాట్ ఫొటోగ్రఫీలో రెండో స్థానం, మెహందీలో మూడో స్థానం, మైమ్‌లో మూడవ స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో మూడో స్థానం, కార్టూనింగ్‌లో మూడో స్థానం, కొలీజ్ లో మూడో స్థానం పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీకి పతకాలు సాధించిన విద్యార్థి కళాకారులను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర రావు, ఇన్‌చార్జి రెక్టర్ కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం అభినందించారు.